# పోలీసు ప్రస్థానం

సూరత్తు వేణుగోపాలరావు

నేను పోలీసు వ్యవస్థలో ఎందుకు చేరానో ఈనాటికి కూడా అంతుపట్టని చిక్కు ప్రశ్నగానే మిగిలిపోయింది. దేశ స్వాతంత్ర్యానికి ముందే కాంపిటీషన్ పరీక్షల్లో నెగ్గి, ఆర్థిక వ్యవహార శాఖలో చేరాను. ఆ శాఖలోనే ఉంటే ఏ ఆడిటర్ జనరల్‌గానో, ఆర్థిక శాస్త్రవేత్తగానో అయ్యేవాడి నేమో అని ఇప్పుడు ఊహాగానాలు చేసుకోవచ్చు. కాని అవి ద్వితీయ సంగ్రామపు రోజులు. యుద్ధం ముగిసేవరకు కొత్తగా ఉద్యోగాలలో చేరిన వారిని ఖాయం చేయరాదని ఆంక్ష పెట్టారు.

తరువాత దేశానికి స్వాతంత్ర్యం రావడం, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఆధ్వర్యంలో రెండు అఖిల భారత పరిపాలనా యంత్రాంగాలని పునర్నిర్మాణం చేయటం, ఆ గొడవల్లో నన్ను ఎకౌంట్స్ సర్వీసు నుంచి ఇండియన్ పోలీసు సర్వీసుకు మార్పడం జరిగింది. "వద్దు బాబోయ్!" అని నేను ఎంత మొత్తుకున్నా ప్రభుత్వంససేమిరా ఒప్పుకోలేదు సరికదా, "మా మాట వినకపోతే నీకు ఉన్న ఉద్యోగం కాస్తా ఊడవచ్చు సుమా" అని బెదిరించింది. ఈ విధంగా పోలీసు వృత్తి నన్ను మెడలు వంచి వరించిం దనే చెప్పాలి.

నాలాగే బలవంతపు బ్రాహ్మణార్థంగా పోలీసు శాఖలో చేరినవాళ్లు చాలామంది ఉంటారు. నిజం చెప్పాలంటే ఐ.పి.ఎస్.లో చేరే విద్యావంతుల్లో చాలామటుకు ఆ వృత్తి మీద ఆపేక్ష గాని, దానికి సమాజంలో ఉన్న కీలకమైన పాత్రమీద ఆసక్తి గాని ఉంటుం దనుకోను. పోలీసు డిపార్ట్‌మెంటుకి ఉన్న పేరు ప్రతిష్ఠలను దృష్టిలో పెట్టుకుంటే అందులో ఎంత ఉన్నతస్థాయికి చేరినా ఆకర్షణీయం కా దేమో అన్న అనుమానం రాకపోదు. ఇది కఠోర సత్యం. పెద్ద పెద్ద ఉత్సవాల్లో, విన్యాసాల్లో దర్జా తొణికసలాడుతూ నిగనిగలాడే యూనిఫారాల్లో అధికారం చెలాయించడం కొంత ఆనందదాయకంగానే ఉండవచ్చు. కాని పోలీసు ఉద్యోగ ధర్మ నిర్వహణలో ఉండే సాధక బాధకాలు, కష్ట నిష్ఠూరాలు అందరికీ తెలియవు.

ఈ వృద్ధాప్యంలో ఒకసారి వెనుతిరిగి చూసుకుంటే, నా చిన్నతనంలో పోలీసుకి సంబంధించిన జ్ఞాపకాలు కొన్ని రాక మానవు.

ముఖ్యంగా నా స్మృతిపథంలో మెదిలేది అరవైఏళ్ల నాటి పోలీసు జవాను. మా నాన్నగారు కైకలూరులో తాలూకా మేజిస్ట్రేటుగా పనిచేస్తూండేవారు. కోలగా ఉండే ఎర్ర టోపీలు పెట్టుకుని, ఖాకీ చొక్కాలు, నిక్కర్లూ వేసుకుని, కాళ్లకు పట్టీలు కట్టుకుని వాళ్లు దొంగలను అరదండాలతో తీసుకు వచ్చేవాళ్లు. క్రమేపీ మా గృహప్రాంగణంలో ఈ ప్రాతఃకాల దృశ్యం సుపరిచితం అయిపోయింది. పోలీసు జవానుల ఆకారాలు, వాళ్ల వినయ విధేయతలు చూస్తూంటే కొంచెం నవ్వుగా ఉండేది. మేజిస్ట్రేటు గారి అబ్బాయిని కదా! ఆ పోలీసులు నాకు కూడా గౌరవం ఇవ్వడమే కాకుండా, అప్పుడప్పుడు ఠంఛనుగా నిలబడి సెల్యూట్ కొట్టినట్లు అలవోకగా గుర్తు. మేజిస్ట్రేటులకు, పోలీసులకు

**ఆ పోలీసు నోటి నుండి రాలిన తిట్లు నా మనసును కలవర పెట్టడమే కాకుండా జుగుప్సను కలిగించాయి. ఈ రెంటినీ మించి గుండెల్లో చెప్పరాని ఆవేదన.**



ఉన్న అవినాభావ సంబంధం ఆనాడు నాకు తెలియదు.

పోలీసు జవానుల సంగతి అలా ఉంచుదాం. వాళ్లు సంకెళ్లు వేసి, ఇనుప గొలుసులతో లాక్కుంటూ తీసుకువచ్చే నేరస్థుల మాట ఏమిటి?

పదిహేను రోజుల నిర్బంధంలో ఉంచడానికి మా నాన్న గారి ఉత్తర్వుల కోసం ఒక రోజు పొద్దున్నే పోలీసులు ఇద్దరు దొంగలను వెంటపెట్టుకుని వచ్చారు. వాళ్లను చూసి నేను అకస్మాత్తుగా ఆగిపోయాను. ఎంత గజదొంగలైనా కావచ్చు. కాని పోలీసుల నిర్బంధంలో ఉన్నారని ఎక్కడలేని ధైర్యంతో, మా నాన్నగారి ఫోజు పెట్టి ఒకడితో- "ఏరా, నువ్వు నిజంగానే నేరం చేశావా?" అని కోపం అభినయిస్తూ ప్రశ్నించాను. అతను తల ఎత్తాడే కాని, తానొక తప్పు చేశానని కాని, చేసిన దానికి పశ్చాత్తాపం పడుతున్నట్లు కాని కనిపించలేదు.

'ఎందు కీ అధిక ప్రసంగం' అని ఒకపక్క అనిపించినా, బాల్య చాపల్యం వల్లనో, తెచ్చిపెట్టుకున్న అధికార గర్వం వల్లనో "ఎందుకు చేశావురా?" అని గర్జించాను. ఆ దొంగ మాట్లాడలేదు కాని వింతగా చూశాడు. ఆ వికృత వదనంలో ఛాయా మాత్రంగా చిరునవ్వు గోచరించింది. 'మనుషులు నేరాలు ఎందుకు చేస్తారు' అని ఆనాడు అడిగిన జటిల ప్రశ్న మానవ జీవి తారంభం నుంచి సమాజం ఎదుర్కొంటున్నదే. దానికి సమాధానం అంత తేలికగా దొరుకుతుందా? అయితే ఒక విచిత్రం. అప్పుడు తెలిసీ తెలియని ప్రాయంలో అడిగిన సమస్య మీద నేను భవిష్యత్తులో చాలా పరిశోధనలు చేస్తా ననీ, ఉత్కృష్టమైన గ్రంథాలు రాస్తాననీ ఎలా అనుకుంటాను.

ఈ సంఘటన తరువాత కొన్నాళ్లకు మరో విచిత్రానుభవం.

ఒక సాయంత్రం నా స్నేహితులతో దాగుడుమూతలు ఆడుకుంటున్నాను. రోడ్డు మీద పోలీసులు ఒక దొంగను పట్టుకుని వస్తున్నారు. వాళ్లు కొంత దూరం వెళ్లిన తరువాత మాలో ఒకడికి బుద్ధి వక్రించి, "దొంగ! దొంగ!" అని అరవడం ప్రారంభించాడు. దానితో మేము కూడా అలాగే అరుస్తూ చిన్న చిన్న రాళ్లను రువ్వటం ప్రారంభించాం.

పోలీసులు మా చిలిపి చేష్టలను మొదట ఖాతరు చేయకుండా వెళ్తుంటే ఉక్రోషంతో మా కోపాగ్నిని వాళ్ల మీదకి మరలించాం. మేము విసిరిన రాయి ఒక కానిస్టేబులుకు తగిలితే అతడు ఎగిరిపడి గంతులు వేస్తూ బెదిరించాడు.

ఆ దృశ్యం చాలా వినోదకరంగా ఉండింది. 'వాళ్లు వెనక్కు రారులే' అన్న ధీమాతో మే మంతా గుమికూడి కేకలు వేస్తూ రాళ్ల వర్షాన్ని ఉధృతం చేశాం.

దానితో ఒక కానిస్టేబుల్ గభాలున వెనక్కు తిరిగి లాఠీ ఝుళిపిస్తూ ఉగ్రరూపంతో మా మీదకు రావడంతో పిట్టలను కొట్టినట్లు త లో దిక్కుకూ పారిపోయాం. ఊరు చిన్నదైనా ఆ సందుగొందుల్లో మమ్మల్ని పట్టుకోవడం అంత తేలికా? తరుముకుంటూ వస్తున్న ఆ రుద్ర రూపం చూస్తే నాకు ముచ్చెమటలు పోశాయి. పక్కనే ఉన్న ఒక గొడ్లపాకలో తల దాచుకున్నాను. ఆ పోలీసు కానిస్టేబులు నా కోసం నలుదిక్కులూ వెదకడం ప్రారంభించాడు. మాలో ఒక్కడైనా దొరికితే తోలు ఒలిచేసేవాడే కాని ఏమీ చేయలేక ఇష్టం వచ్చినట్లు బండబూతులు అసభ్యంగా తిట్టాడు. ఎప్పుడైనా తన చేతుల్లో పడితే సున్నంలో ఎముక లేకుండా చేస్తా నని శపథం చేస్తూ నిష్క్రమించా

డు. ఆ అనుభవంతో నాకు జ్ఞానోదయం కలిగింది.

ఆ పోలీసు నోటి నుండి రాలిన తిట్లు నా మనసును కలవర పెట్టడమే కాకుండా జుగుప్స కలిగించాయి. ఈ రెంటినీ మించి గుండెల్లో చెప్ప రాని ఆవేదన. ఆ పోలీసు నన్ను గుర్తించాడేమో, నేను చేసిన తప్పు పెద్దవాళ్లకు తెలిసిపోతుం దేమో అని ఏమేమో ఆలోచనలు! కొంచెం కునుకు పడితే చాలు, నన్ను పోలీసులు చిత్ర హింసలు పెడుతున్నట్లు భయానకమైన కలలు. ఆ రాత్రి నాకు నిజంగా కాళరాత్రి!

ఒక వారం జరిగిపోయింది. 'ఇక పరవాలే దులే' అని ఊపిరి తీసుకుంటుంటే అకస్మాత్తుగా ఒక ఆశనిపాతం నా మీద పడింది. మా నాన్నగారి కబురు మీద ఆయన గదిలోకి వెళ్లాను. కుదురుగా కుర్చీలో కూర్చున్న ఇనస్పెక్టరును చూడగానే నా పై ప్రాణం పైకే పోయింది.

బుంగ మీసాలతో, ఎర్రటి జరీ తలపాగాతో మిలమిల మెరిసే నల్లటి బూట్లు వేసుకుని ఆయన 'శ్రీకృష్ణ లీలలు' నాటకంలో చిలిపి కృష్ణు డిని పరిమార్చడానికి కంకణం కట్టుకున్న కంసు డిలా కనపడ్డాడు.

భయంతో వెనక్కి తగ్గాను. కాని ఇన్‌స్పెక్టరు గారు నన్ను దగ్గరకు పిలిచి, "బాబూ, బాగా చదువుకుంటున్నావా?" అని నెమ్మదిగా కుశల ప్రశ్న వేశాడు. వారం రోజుల క్రితం జరిగిన

> **ధర్మ నిర్వహణకు, నైతిక బాధ్యతలకు మధ్య సంకుల సమరం నిరంతరమూ ఉండేదే. ఇందులో బాగా నలిగిపోయేది పోలీసులే.**

విషయాన్ని గురించి నా ముందు ప్రస్తావించలేదు. ఇనస్పెక్టరు గారు వెళ్లిపోయిన తరువాత మా నాన్నగారు నా కేసి కోపంగా చూస్తూ, "నువ్వూ, నీ స్నేహితులూ చేసిన పని చాలా సిగ్గు చేటు" అన్నారు.

ఆ విధంగా ఆయన మాట్లాడటం నా జీవితంలో ప్రప్రథమం అనుకుంటాను. నేను తప్పు ఒప్పు కుని, 'ఇక మళ్లీ ఎప్పుడూ చేయను' అని కళ్ల నీళ్లు పెట్టుకున్నాను.

ఆయన నన్ను బుజ్జగించి, "ఒక విషయం మాత్రం నువ్వు మనసులో ఉంచుకోవాలి. న్యాయ పరిరక్షణ పోలీసుల ధర్మం; అది పాటించడం మన ధర్మం" అన్నారు. ఆ మాటలు నేను ఎన్నటికీ మరిచిపోలేదు.

పెరిగి పెద్దవాడినై బాధ్యతా యుతమైన ఉన్నత పోలీసు ఉద్యోగంలో పలుసార్లు క్రోధాన్వితులైన ప్రజలను ఎదుర్కోవలసిన అవసరాలు ఎన్నో తటస్థపడ్డాయి. ఆ సమయాలలో చాలా సహనం, మనో స్థైర్యం, ధైర్యం ఉండాలి. ధర్మ నిర్వహణలో భయానికి, సంశయానికి తావు లేదు. కాని ప్రస్తుత రాజకీయాలలో పోలీసుల ఉద్యోగ ధర్మాలని గు రించి పట్టించుకుంటున్నది ఎవరు?

ధర్మ నిర్వహణకు, నైతిక బాధ్యతలకు మధ్య సంకుల సమరం నిరంతరమూ ఉండేదే. ఇందులో బాగా నలిగిపోయేది పోలీసులే. సమా జంలో ప్రభుత్వ పరిపాలనా విధానాల్లో పోలీసు వ్యవస్థకు అతిముఖ్యమైన పాత్ర ఉంది. కాని ఆచరణలో ఉచితానుచిత విచక్షణతోపాటు మానవ త్వానికి కూడా ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం ఉంది.

1947వ సంవత్సరానికి ముందు బ్రిటిష్ హయాంలో సృష్టించిన పోలీసులు, తదితర అధి కార వర్గం స్వాతంత్ర్యోద్యమాన్ని కర్కశంగా అణచి వేయటానికే సాయపడ్డా రనేది చారిత్రక సత్యం. ఆంగ్లేయులు తమ రాజకీయావసరాలకి అనుకూ లంగా పోలీస్ వ్యవస్థను సృష్టించుకున్నారు. ఆ వ్యవస్థ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి దోహదంగా ఉండే దంటే ఎవరు కాదనగలరు?

[సశేషం]

## ● వింత కబోది

వెనకటికి ఒక రాజు గారు ఉండే వా రట. తిక్కలో ఆయనకు ఆయనే సా టట. ఓ శుభముహూర్తాన ఆయనకు భేషైన ఆలోచన వచ్చింది. రాత్రిని పగలుగానూ, పగటిని రాత్రిగానూ మార్చాలన్నదే ఆ ఆలోచన. అయితే భూ, సూర్యుల గమనాలు ఆయన చేతిలో లేవు కనక ప్రజలందర్నీ పగటి పూట నిద్రించాలనీ, రాత్రి పూట పగలు చేసే పనులు చేయాలనీ శాసించాడట. ఆ కథ ఆధారంగా హిందీలో తిక్క సామ్రాట్‌ల గురించి చెప్పేటప్పుడు "అంధర్ నగరీ, చౌపట్‌రాజీ" అన్న సామెత వచ్చింది.

ఇట్టి రాజులు లేకపోయినా గూర్ఖాల వంటి కాపలా వారు నిత్యమూ రాత్రులు జాగరణ చేస్తూనే ఉంటారు. వాళ్ళు విధిగా పగటి పూట పడుకుంటారు. ఇది వారి ఉద్యోగ ధర్మమని సరిపెట్టుకుంటే, యాంగ్‌చూన్‌ప్రా అనే చైనా రైతుకు ప్రకృతే ఒక వింత పరిస్థితిని కల్పించింది.

మనాన్ రాష్ట్రంలో ఉండే ఇతగాడికి ఒక విచిత్రమైన కంటి వ్యాధి పట్టుకుంది. అతను రాత్రిపూట ఏ కళ్ళద్దాల సహాయమూ లేకుండా, ఎంచక్కా సూదిలో దారం ఎక్కిస్తాడు. నిక్షేపంగా అతిచిన్న అచ్చులు ఉన్న పుస్తకాలను కూడా చకచకా చదివేస్తాడు. అయితే పగటి పూట మాత్రం పుట్టుగుడ్డిలాగా ఇతనికి ఏమీ కనిపించదు. మూడో ఏట ఇతనికి ఈ వ్యాధి




వచ్చిందట. అయితే ఏ భిషగ్వరుడూ కూడా ఈ రోగానికి చికిత్స చేయలేకపోయాడట. దాంతో యాంగ్ రాత్రులు పనులు చేసుకుంటూ పగళ్ళు గుర్రుకొట్టి నిద్రపోతున్నాడు.

ఇతని వ్యవహారం వింటుంటే కబోది పక్షులు గుర్తుకు వస్తాయి. అవి కూడా అంతే. పగటి పూట కళ్ళు కనిపించకపోవడంతో చెట్లకు తలక్రిందుగా వేలాడుతూ ఉంటాయి. రాత్రులు రెపరెపలాడుతూ ఆహారాన్వేషణలో పడుతాయి.

కె.ఆర్.కె.మోహన్

## నేటి కోపిష్టులు - రేపటి హృద్రోగులు !

'తన కోపమె తన శత్రువు' అని సుమతీ శతకకారుడు ఉత్తినే అనలేదు. క్రోధం వలన వివేకం నశిస్తుంది అంటుంది గీత. వివేకమే కాదు ఆరోగ్యం కూడా నశిస్తుం దని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కౌమార దశలో కోపిష్టులుగా మాటకు మాట చెబుతూ పందెపు కోళ్ళ మాదిరి కాలు దువ్వుతూ కనిపించేవారు పెరిగి పెద్దయ్యాక 'గుండె జబ్బులు' కొని తెచ్చుకునే అవకాశాలు చాలా ఎక్కువని అమెరికా, డుగ్యాక్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ రెడ్ ఫోర్డ్ విలియమ్స్ చెప్పారు.

తరచు ఇతరుల పట్ల ద్వేషభావంతో ప్రవర్తించే వారికి, కోపిష్టి దూర్వాసులకీ ఈ ప్రమాదం అధిక మని డాక్టర్ విలియమ్స్‌తో సహా పలువురు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. "పంతొమ్మి దేళ్ళ ప్రాయంలో అధిక ద్వేష భావాన్ని ప్రదర్శించే వారు నలభయ్యో పడిలో పడేసరికి వారి శరీరంలో కొలెస్టరాల్ శాతం విపరీతంగా పెరిగిపోతుంది" అని డాక్టర్ విలియమ్స్ చెప్పారు. విభిన్న పరిస్థితుల్లో బలమైన భావోద్వేగాల్ని, ముఖ్యంగా క్రోధం ప్రదర్శించేవారు గుండెపోటుతో మరణించే ప్రమాదం అధికమని 'ఏల్' పరిశోధకుల ఉవాచ. మనిషి కోపోద్రిక్తుడైనప్పుడు శరీరంలోపల శక్తిని విడుదల చేసే 'అడ్రినలిన్' తరహా స్ట్రెస్ హార్మోన్‌లు బాగా ఎక్కువగా స్రవిస్తాయి. ఇవి కొవ్వు పదార్థాలైన లిపిడ్‌లను రక్తంలోకి విడుదల చేస్తాయి. కొవ్వు పదార్థాలు రక్త నాళాల్లో చిన్న చిన్న ముద్దలుగా ఏర్పడి, రక్తస్రావానికి అడ్డుపడి రక్తాన్ని పంపిణీ చేయాల్సిన గుండె మీద ఒత్తిడిని పెంచుతాయి. ఫలితం గుండె జబ్బు - ఇదీ డాక్టర్ విలియమ్స్ వివరణ.

సిరంగి విజయలక్ష్మి